క్లుప్తంగా

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి



రేపల్లె రూరల్: ఎల్ఐసీ ఏజెంట్లకు వ్యతిరేకంగా యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ బుధవారం రేపల్లె ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయంలో ఏజెంట్లు నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ అభివృద్ధికి ఏజెంట్ల కృషి ఎనలేనిదన్నారు. ఏంజెట్ల కమీషన్‌ను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం సరైనది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం రేపల్లె బ్రాంచ్ అధ్యక్షుడు డి.బసవరాజు, డివిజన్ సెక్రటరీ గరికపాటి వెంకటేశ్వరరావు, నాయకులు రాంబాబు, డీటీవీ ప్రసాద్, గుంటి సాంబశివరావు, ఎస్.సాంబశివరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తు గడువు పొడిగింపు



వేమూరు: మద్యం షాపుల టెండర్ల షెడ్యూలు ఈనెల 11వ తేదీ వరకు పొడిగించినట్టు ఎక్సైజ్ స్టేషన్ సీఐ రవి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో 12 షాపులకు 79 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఆయన తెలిపారు. తొలుత ఈ నెల 9 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని వివరించారు. బ్యాంక్ సర్వర్లు సక్రమంగా పని చేయక పోవడంతో ఈ నెల 11 సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఆయన చెప్పారు. ఈ నెల 14న లాటరీ తీస్తామని పేర్కొన్నారు. 16 నుంచి కొత్త మద్యం పాలసీ విధానం అమలు చేస్తామని వెల్లడించారు.

జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

సూరేపల్లి(భట్టిప్రోలు): బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర-2047 అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన శనగపల్లి నవ్య (10వ తరగతి) జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. బాపట్ల కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకట మురళి చేతుల మీదుగా మంగళవారం నవ్య షీల్డ్, సర్టిఫికెట్ అందుకుంది. ప్రతిభ చూపిన నవ్య, ఆమెకు శిక్షణ ఇచ్చిన కె. శ్యామకుమారిలను బుధవారం పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, హెచ్ఎం కూచిభొట్ల శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

మోదుకూరులో నేడు అమ్మ ప్రతిమల ఛాయాచిత్ర ప్రదర్శన

మోదుకూరు(వేమూరు): చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామంలో కనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో అమ్మ విగ్రహాల, ప్రతిమల ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు యువ పురావస్తు పరిశోధకుడు పాముల పాటి శ్రీనాథ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10:30 గంటలకు ప్రదర్శన ప్రారంభమవుతుందని, శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకు ప్రదర్శన ఉంటుందని వివరించారు.

లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు



బాపట్లటౌన్: లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పట్టణ సీఐ అహ్మద్‌జానీ తెలిపారు. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు. పట్టణ సీఐ మాట్లాడుతూ కాలం చెల్లిన వాహనాలు నడిపినా, లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపినా అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించి సరైన పత్రాలు లేని 14 మందిపై కేసులు నమోదు చేశారు. వాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

భవనాన్ని అప్పగించాలంటూ డ్వాక్రా సంఘాల వినతి

తెనాలిరూరల్: మండలంలోని సంగంజాగర్లమూడిలో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తున్న భవనాన్ని తమకు అప్పగించాలని డ్వాక్రా సంఘా లు డిమాండ్ చేస్తున్నాయి. గ్రామానికి చెందిన ఓ దాత తన తదనంతరం భవనాన్ని డ్వాక్రా సంఘాల కార్యకలాపాలకు వినియోగించాలంటూ ఎంపీడీవో పేరున రిజిస్టర్ చేయించా రు. అప్పటి అవసరాల కోసం అధికారులు ఈ భవనంలో 12 ఏళ్ల క్రితం అంగన్‌వాడి కేంద్రా న్ని ఏర్పాటు చేయగా ఇప్పటికీ కొనసాగుతోంది. దాత ఆశయాలకనుగుణంగా భవనాన్ని తమకు అప్పగించాలని డ్వాక్రా సంఘాల సభ్యులు ఇటీవల తహసీల్దార్ గోపాలకృష్ణకు అర్జీ సమర్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇక్కడే కొనసాగించాలని సీడీపీవో, అంగన్‌వాడి టీచర్లు కోరుతున్నారు.

‘బోద’పడుతుందా!

- భట్టిప్రోలును వణికిస్తున్న ఫైలేరియా
- ఏటా రెండు, మూడు కేసులు
- 2022 నుంచి కేసుల్లేవంట!
- డీఈసీ మాత్రల పంపిణీ నిలిపివేత
- పట్టించుకోని సర్కారు
- నివారణ కేంద్రం ఏర్పాటుకు డిమాండ్



భట్టిప్రోలు విఠలేశ్వరనగర్‌లో ఇళ్ల మధ్య చేరిన వర్షపు, మురుగు నీరు

భట్టిప్రోలు: భట్టిప్రోలును బోదవ్యాధి వణికిస్తోంది. ఏటా రెండు, మూడు కేసులు నమోదవుతున్నా.. అధికారులు మాత్రం 2022 నుంచి కేసుల్లేవంటూ చెబుతున్నారు. డీఈసీ మాత్రల పంపిణీని సర్కారు నిలిపివేసింది. ఫలితంగా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలులో సుమారు 13వేల జనాభా ఉన్నారు. గ్రామం ఇప్పుడు మేజర్ పంచాయతీ. నగర పంచాయతీ హోదాకు చేరువలో ఉంది. అయినా డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దోమల బెడద అధికంగా ఉంది. ఫలితంగా బోద వ్యాధి విస్తరిస్తోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో 70శాతం రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలే. చేనేత కార్మిక కుటుంబాలూ అధికమే. పేదలు ఎక్కువగా బోద వ్యాధి బారిన పడుతున్నారు. సరైన వైద్యం చేయించుకునే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఏటా నవంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఫైలేరియా నివారణ వారోత్సవాలు నిర్వహించేవారు. డీఈసీ మాత్రలు పంపిణీ చేసేవారు. అయితే ఇప్పుడు ఆ మాత్రల పంపిణీ చేయడం లేదు. బోదవ్యాధి నిర్ధారణ పరీక్షలకు రేపల్లెలో బోదవ్యాధి నివారణ సబ్ యూనిట్ ఉంది. బోద వ్యాధి నిర్ధారణ పరీక్షలు రాత్రివేళల్లోనే చేయాలి. అయితే రేపల్లెలోని యూనిట్ రాత్రుళ్లు పనిచేయడం లేదని సమాచారం. భట్టిప్రోలులో బోదవ్యాధి నివారణ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాధి సోకిన వెంటనే గుర్తించాలి

బోదవ్యాధి సోకితే ముందు జ్వరం వస్తుంది. గజ్జల్లో బిళ్లలు కట్టి ఆ తర్వాత వాపు, నొప్పి వస్తాయి. క్రమంగా చెయ్యి, కాలు, తదితర భాగాలకు వాపు వ్యాపించి శాశ్వత రుగ్మతగా మారుతుంది. వ్యాధి సోకిన వెంటనే గుర్తించి తగిన చికిత్స చేయకుంటే వ్యాధి ముదిరే ప్రమాదం ఉంది. కొన్ని సందర్భాల్లో అవయవాలు తొలగించాల్సిన దుస్థితి కూడా రావచ్చు. క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల ఇది వ్యాపిస్తుంది.



బోదకాలు సోకిన వ్యక్తి పాదం



భట్టిప్రోలులో ఓ పంచాయతీ కుళాయి వద్ద నెలకొన్న దుస్థితి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దోమలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమతెరలు వినియోగించాలి. వేపాకుతో పొగ పెడితే దోమలు దరిచేరవు. మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. బోదవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి భట్టిప్రోలు పీహెచ్‌సీ పరిధిలో 2022 వరకు 124 కేసులు నమోదైతే 50 ఐలవరంలో నమోదయ్యాయి.

– ఎస్.ప్రసన్నబాబు, హెల్త్ సూపర్‌వైజర్, భట్టిప్రోలు

సిలబస్ తగ్గించాలని వినతి



భట్టిప్రోలు: కొత్తగా మారిన 10వ తరగతి సాంఘిక శాస్త్రంలో సిలబస్‌ను తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక శాస్త్ర టీచర్స్ ఫోరం (ఏపీఎస్ఎస్‌టీఎఫ్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ బుధవారం విజయవాడలోని ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయంలో డైరెక్టర్ ప్రతాపరెడ్డిని కలసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మురళీమోహన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూనటి సురేష్ మాట్లాడుతూ రోల్‌తో సంబంధం లేకుండా 9, 10 తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలని, సాంఘిక శాస్త్ర దినోత్సవంగా నవంబర్ 26ను ప్రకటించాలని, జీవో 117 వల్ల ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో కలపడం వల్ల 3 నుంచి 10వ తరగతి వరకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు బోధిస్తున్నందున.. ఈ జీవోను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డి.శ్రీనివాస్, వెస్ట్ గోదావరి ఆర్థిక కార్యదర్శి అన్నాజి (శ్రీకాకుళం) పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



భట్టిప్రోలులో శిక్షణ ప్రారంభంలో గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న ఎంపీపీ

భట్టిప్రోలు: గ్రామ పంచాయతీల ప్రగతి పథంలో నడవాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి చెప్పారు. ఏపీఎస్ఐఆర్డీ ఆదేశానుసారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ లలిత కుమారి, ఎంపీడీఓ ఎస్‌వీ రమణ, ప్రజాప్రతినిధులు గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఇంటి, నీటి పన్నుల ద్వారా వచ్చిన వాటిని ఎలా ఖర్చు పెట్టాలి? 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయింపు తదితర అంశాల గురించి ఎంపీపీ వివరించారు. రిసోర్స్ పర్సన్స్ వక్కలగడ్డ సురేష్‌బాబు, అడిగోపుల సురేష్‌బాబు, మంచి కోటేశ్వరరావు పంచాయతీ విధులు, బాధ్యతలు, అధికారాల గురించి తెలియజేశారు.

తూతూ మంత్రంగా..

వేమూరు: గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు బుధవారం శిక్షణ తరగతులు తూతూమంత్రంగా జరిగాయి. ఎక్కువ మంది గ్రామ ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు రాక పోవడంతో అధికారులు కార్యక్రమాన్ని మమ అనిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ ఆర్ఎం హరికృష్ణ



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ గుంటూరు రీజనల్ మేనేజర్ హరికృష్ణ ఆదేశించారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డు లోని కంపోస్ట్ యార్డును బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డులోని కుక్క ల శస్త్ర చికిత్సాలయం, వర్మీ కంపోస్ట్ యూనిట్‌లను పరిశీలించారు. కుక్కల శస్త్ర చికిత్సలు నిలచిపోవటంపై ఆరా తీశారు. వెంటనే శస్త్ర చికిత్సలు ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే కంపోస్ట్ యార్డు తరలింపు ప్రక్రియ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే దానిని తరలించాలని సూచించారు.

బాపట్ల మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



రఘునాథరెడ్డి

బాపట్ల: మున్సిపల్ కమిషనర్‌గా రఘునాథరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ఈయన బాపట్లకు వచ్చారు. బాపట్ల మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ప్రజలకు నిత్యం పుర సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: రోడ్లపై వ్యర్థాలు లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 29, 37 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



అరవపల్లిలో పొలాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు తదితరులు

రేపల్లె రూరల్/వేమూరు: రైతులు సాగులో సస్యరక్షణ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు చెప్పారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని అరవపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూసారం పెరగటంతోపాటు పర్యావరణ హితులుగా మారవచ్చని పేర్కొన్నారు. ప్రస్తుతం పైరు ఎదిగే దశలో తెగుళ్ల ఆశించేందుకు అవకాశం ఉంటుందని, నిరంతరం పంటను పర్యవేక్షిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. రైతులు తాము కొనుగోలు చేసే ఎరువుల నాణ్యతను పరిశీలించిన తరువాతనే వినియోగించాలన్నారు. వ్యవసాయ సహాయకులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉండి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఏఏలు కె.సుమంత్, డి.అమూల్య, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

– అమర్తలూరు మండలం అబ్బనగుంటపాలెం, మోపర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయాధికారి ఉయ్యూరు లోకేశ్వరి రైతులతో మాట్లాడారు. వర్షాలకు దెబ్బతిన్న పంటల రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు టి.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

● నమో సరస్వతీ



ఈపూరులోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో బుధవారం అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థులు సామూహిక సరస్వతి పూజలు చేశారు. సరస్వతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. – ఈపూరు



భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ప్రత్యేక అలంకారం



చెరుకుపల్లిలో సరస్వతిదేవి అలంకారంలో దుర్గాదేవి



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో సరస్వతి దేవిగా వాసవీ మాత



కర్లపాలెంలో సరస్వతీదేవి అలంకారం



నగరంలో సరస్వతీ దేవీ అలంకరణలో అమ్మవారు



కొల్లూరు పార్వతీ అమ్మవారి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం




చుండూరు మండలం చినపరిమి గ్రామంలో..



బాపట్ల మండలం ముత్తాయపాలెంలో..



భట్టిప్రోలులో సామూహిక పూజల్లో మహిళలు



రేపల్లె ఇసుకపల్లిలో సరస్వతిదేవి అలంకరణలో భ్రమరాంబ



భట్టిప్రోలు వాసవి మాత ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలో చిన్నారులు

వీణాపాణీ వందనం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. భక్తులను కటాక్షించారు. వీణాపాణీ వందనం అంటూ భక్తులు ప్రణమిల్లారు. పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీదేవి పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

– భట్టిప్రోలు/చెరుకుపల్లి/రేపల్లె రూరల్/కర్లపాలెం/బాపట్ల టౌన్/నగరం/కొల్లూరు/వేమూరు



చెరుకుపల్లిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న వేదపండితులు



రేపల్లె రైలుపేట రామలింగేశ్వరస్వామి గుడిలో సామూహిక సరస్వతి పూజలు చేస్తున్న విద్యార్థులు



బాపట్ల కోనప్రభాకరరావు కళాక్షేత్రంలో..

లింగ నిర్ధారణ పరీక్షలపై చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ



తెనాలిఅర్బన్: తెనాలి డివిజన్ పరిధిలోని స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటీ సలహా సంఘ సమా వేశాన్ని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. వీటిని ఎవరూ ప్రోత్స హించరాదని సూచించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ వద్ద లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం నేరమని తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డాక్టర్ విసీల్, డాక్టర్ హరిణి, డాక్టర్ సురేష్, సీనియర్ ఏపీపీ పి.సునీల్ కుమార్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ముమ్మనేని భానుమతి, పి.వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తెస్తాం

తెనాలిఅర్బన్: తెనాలి ఆర్టీసీ డిపోకు పూర్వవైభవం తీసుకువస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి డిపోకు నూతనంగా వచ్చిన ఆరు బస్సులను, ఆవరణలో నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపోను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మొదటి విడతలో సీసీ రోడ్డు కొంత భాగం ఏర్పాటు చేయటం జరిగిందని, మరో విడతలో మిగిలిన భాగాన్ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేర్చేది ఆర్టీసీ మాత్రమేనని, దీని సేవలు ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి డిపోలో 100 బస్సులు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే డిపోను ప్రథమ స్థానంలో ఉంచే విధంగా చూస్తామని చెప్పారు. తెనాలి-గుంటూరు రోడ్డుకు త్వరలో మరమ్మతులు చేయిస్తామని.. నిలిచిపోయిన తెనాలి-మంగళగిరి నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో డీపీటీవో ఎం.రవికాంత్, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పాల్గొన్నారు.